# అనువాదకుని ముందు మాట

ఇదంతా సుమారు నలభై సంవత్సరాల ముందు జరిగిన సంగతి. 1966 లో జయకాంతన్ ***అగ్ని ప్రవేశం*** అనే కథ తమిళ పత్రిక **ఆనంద వికటన్** లో రాసారు. అది ఒక సాధారణమైన ఇతివృత్తంతో, చిక్కులు ఏవీ లేని కథ; అందులో మూడే పాత్రలు: ఒక తల్లి, ఒక కూతురూ, ఆమె పెద్దన్నయ్య - ఎవరికీ పేరులు లేవు. కథలో వర్ణించబడే సంఘటన ఎటువంటి నగరంలోనూ, పేటలోనూ సాధ్యం అని నమ్మవచ్చు. అందువలనే ***అగ్ని ప్రవేశం*** ఒక సర్వసామాన్య కథగా పరిణమించింది.

జయకాంతన్ ఇదివరకు రాసిన కథల్లో *అగ్ని ప్రవేశం* అధికంగా వివాదాస్పదమైనది. ఒక పదమూడేళ్ళ బాలిక ఒక మగవాడి బలాత్కారానికి బలి అయిన తరువాత ఆమె తల్లి ఎలాగ ఈ దుర్ఘటనలో కూతురు జీవితం సరిదిద్దిందని చెప్పే కథ. మామూలుగా ఏ స్త్రీ ఐనా తన కుటుంబానికి అపకీర్తి కల్గించిన కూతురిని ఏం చేస్తుందో అలాగే ఈ తల్లి కూడా ఈ పిల్లని చంపేసి తనూ సముద్రంలో దూకుదామని ఆలోచించింది. కాని ఒక నిమిషం ఆగి, నిదానంగా జరిగిన సంఘటన, తన కూతురు స్థితి పరిశీలించి, తనకున్న అపార ప్రేమవలన కూతురుకి కొత్త మార్గం చూపించింది. కూతురు చెప్పినదంతా విని, ఆమెను ఓదార్చి, ఆమెమీద నీళ్ళు పోసి, దేహాన్ని గట్టిగా రుద్ది, కడిగి, ఆ తల్లి చెప్పింది: " అమ్మాయీ, విను. ఇప్పుడు నేను నీ మీద పోసినది నీరు కాదు, అది అగ్ని! ఈ ప్రమాదం జరగడానికి ముందు నీ మనసు లో ఎటువంటి కళంకమూ లేదు. ఇప్పుడు నీ దేహం పావనమైంది. తనంతర దానికి ఏర్పడిన పాపం పోయింది. నువ్వు ఈ సంభవాన్ని ఒక చెడ్డ కలగా భావించి ఇక అన్యుల దగ్గర జాగ్రత్తగా నడుచుకోవాలి."

ఈ తల్లి బోధన అర్థం చేసుకోడానికి మనం రామాయణంలో సీతాదేవి చేసిన అగ్ని ప్రవేశం జ్ఞాపకపరచుకోవాలి. ఈ తల్లి బోధన ప్రకారం ఆమె కూతురు ఏ పాపమూ చేయలేదు; తనలో ఎటువంటి దోషమూ, అవమానమూ, లేదని ఆమె మనసార నమ్మాలి; ఆ సీతాదేవి లాగే తన దేహంకూడా పరిశుద్ధమైందని ఆమె గ్రహించాలి; ఐతే ఈ సంఘటన గురించి ఆమె - ఏమైనా సరే - మరెవరికీ చెప్పకూడదు: కారణం, తన తల్లిలాగ మరెవరూ ఆమె మనసును అర్థం చేసుకోలేరు. ఆఖరికి ముక్తసరిగా, కచ్చితంగా ఆ తల్లి చెప్పిన సందేశం ఇది: తన కూతురు ఇక తన భవిష్యత్తులో ఎటువంటి తాపత్రయం లేకుండా జీవితం గడపాలి; పెళ్ళైయిన తరువాత తన భర్తకి తన్ను ఎటువంటి సంశయమూ, అవమానమూ, లేకుండా ఒప్పగించుకోవాలి. ఇవి ఒక తల్లి పుత్ర వాత్సల్యంతో, తన పదమూడేళ్ళ కూతురికి చెప్పిన ఉపదేశం. ఈ వాక్యాలు చదివిన తరువాత జయకాంతన్ ఎంత ధీర్గంగా ఆ తల్లి హృదయాని అర్థం చేసుకున్నారని మనకి బోధపడుతుంది. కాని విమర్శకులు ఈ కథ ముగింపుని ఖండిచారు; అది దుర్నీతులని బోధిస్తుందని అరిచి గీపెట్టారు. ఈ వివాదాలు, మారుమాటలు, జరుగుతుండగా జయకాంతన్ అవన్నీ సావధానంగా విన్నారు. కాని కొందరు రచయితలు **అగ్ని ప్రవేశం** కథని సరిదిద్దాలనే వంకలో దాని ముగింపు మార్చి కొత్త కథలు రాయడంతో - అలాంటి ఒక కథలో ఆ అమ్మాయి తన అన్నయ్య తల్లిని ఖండించడంతో ఆత్మ హత్య చేసుకుంది - పరులు తన సాహిత్యంలో జోరపడడం సహించలేక జయకాంతన్ తనే *అగ్ని ప్రవేశం* కథని విస్తరించి ఒక నవల రాసారు. ఆ నవల పేరు ***సిల నేరంగళిల్ సిల మనిథర్గళ్.***

1972లో ఆ నవలకి సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది; ఆ తరువాత ఒక చలన చిత్రంగా మంచి పేరు పొందింది. సాహిత్య అకాడెమీ వారు ఈ నవలని ఇతర బాషలలో ప్రచురించారు. దీన్ని మాలతి చందూర్

తెలుగులో అనువాదం చేసారు. దాని పేరు ***కొన్ని సమయాల్లో కొందరు మనుషులు.***

ఈ నవలని ఐదు సంవత్సరాల తరువాత మళ్ళీ విస్తరించి జయకాంతన్ ఇంకొక నవల రాసారు. అది ***కుముదం*** వార పత్రికలో సీరియల్గా వచ్చింది. దాని అనువాదమే ఈ ***గంగా తపస్సు.***

తమిళ రచయితల చరిత్రలో ఒక రచయిత రాసిన రెండు నవలలు - ఒకే కథానాయికతో - ఐదు సంవత్సరాల ఎడబాటులో - రెండు ప్రజారంజక వార పత్రికలలో ప్రచురించబడడం ఇంతవరకు జరగలేదు అని చెప్పవచ్చు. ఆ ఏకైక గౌరవం జయకాంతన్ కే లభించింది.

ఈ ప్రచురణకి అవతారిక అర్పించిన మాలతీ చందూర్గారికి నా కృతజ్ఞతలు.

తన నవలను తెలుగులో అనువదించడానికి అనుమతి ఇచ్చి నన్ను ప్రోత్సాహించిన మూల రచయిత జయకాంతన్ గారికి నా కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు.

ఏండి సుందరేశన్
December 15, 2009
El Cerrito, CA 94530,
USA